ఇన్‌స్పెక్షన్ పూర్తి చేసుకుని అతను పదోరోజు మధ్యాహ్నం హైదరాబాద్ వెళ్ళిపోయాడు. ఆ రోజు సాయంత్రం దేవసేనరావు ఆఫీస్ నించి ఇంటికి వచ్చాక అడిగారు అంతా.

"మీ కార్టునిస్టు వెళ్ళిపోయాడా?"

తలవూపాడు దేవసేనరావు

"రోజుకి పదిదాకా కార్టూన్స్ గీస్తాడట తొమ్మిది రోజులు అతని కార్టూన్స్ గీసే సమయంలో భోజనం మిషతో అతన్ని కార్టూన్స్ గీయ కుండా ఆపగలిగాం అంటే దాదాపు తొంభై కార్టూన్స్ నించి ఆంధ్ర పాఠ కులని కాపాడగలిగాం" చెప్పాడు వాటానంబర్ మూడు.

"అతని మాటల్లోని హాస్యం కార్టూన్సులో చసేకనపడవెందుకో. హైదరాబాద్‌లో కొన్ని లక్షల మంది వున్నారు వాళ్ళలో అతని అభి మానులు కానివాళ్ళ వేలల్లో వుంటారు చిరునామా కనుక్కొని రోజుకొకరు భోజనానికో సినిమాకో పిలిచి అసలు కార్టూన్స్ గీసే టైంలేకుండా చేస్తే అనే ఆలోచన మనలా వాళ్ళలో ఏ ఒక్కరికి వచ్చినా ఎంత బావుంటుంది" చెప్పాడు వాటానంబర్ పన్నెండు యజమాని.

## అందమైన కారు

పదిహేను వేల రూపాయలు అందించాడు వెంకటేశ్వర్లు రుతుపవన్‌కి ఇదరూ కరచాలనం చేశారు.

"జాగ్రత్తగా చూసుకోండి గత ఆరేళ్ళుగా ఈ కారుని సింగిల్ హేండెడ్‌గా నడుపుతున్నాను."

హెరాల్డ్ కారు తాళం చెవులగుత్తి వెంకటేశ్వర్లకి అందించి చెప్పాడు రుతుపవన్ రుతుపవన్ మనసులో కొద్దిగా వెలితి ఫీలయ్యాడు తన కారు వెంకటేశ్వర్లకి అమ్మేయడంతో.

ఆ చిన్న తెల్ల రంగు కారు సెంటిమెంటల్‌గా ఎంతో విలువవైంది రుతుపవన్‌కి. అందులో ఎన్నో అందమైన అనుభవాలు, అనుభూతులు, మొట్టమొదటిసారిగా, కారు యజమానిగా తను ఫీలయిన సంతృప్తి అదే ఇచ్చింది. పద్మిని ప్రియదర్శిని ఇంకా ఖరీదైన, ఇంకా సౌకర్యమైన కారే అయినా, మొదటిది ఎప్పుడూ మొదటిదే.

అరనిమిషం కూడా కాలేదు. రుతుపవన్ మళ్ళీ మామూలు మనిషయి పోయాడు సెంటిమెంటలిస్ట్ కాదతను—ప్రాక్టికల్‌గా ఆలోచించే రచయిత.

వెంకటేశ్వర్లు వారం రోజుల్లో డ్రయివింగ్ నేర్చుకుని కారుని తనే స్వయంగా నడపసాగాడు. నిజానికి అతని పర్సనాలిటీకి ఆ కారు ఎబ్బెట్టుగా వుంటుంది. ఉన్నంతలో తృప్తిపడాలి.

ఆకారు కొన్న మూడోరోజు మొదటిసారిగా ఆ అనుభవం ఎదురైంది వెంకటేశ్వర్లుకి

ఉదయం సికింద్రాబాద్ స్టేషన్‌బయట కారు పార్క్ చేసి, తన భార్యని కృష్ణాఎక్స్‌ప్రెస్ ఎక్కించి బయటకి వచ్చాడు. కారులో కూర్చుని ఉంది ఓ అమ్మాయి. పాతికలోపే వయసు.

"నేనొస్తున్నానని ఉత్తరం కూడా రాయకండా ఎలా తెలుసు!"

వెంకటేశ్వర్లు తొంగి లోపలికి చూసాక ఆ అమ్మాయి తెల్లబోయింది. వెంటనే కారిదిగి నంబర్ చూసి అడిగింది.

"పవన్ రాలేదా?"

"ఆయనకారు నేకొన్నాను."

"ఓ సారీ! అవును, ఆమధ్య ఫియట్ బుక్ చేసానని చెప్పాడు.

నాలుగు రోజుల తర్వాత కారు బషీర్‌బాగ్‌లో ట్రాఫిక్ లైట్స్ దగ్గర ఆగితే ఓ ఇరవై ఏళ్ళ అమ్మాయి చటుక్కున తలుపు తెరచి పక్కన కూర్చుంది

"ఓ కే వద్దా, ఫోన్ చేయటం లేదు...."

వెంకటేశ్వర్లుని చూసి బిత్తరపోయి ఆగిపోయింది.

"ఓ కే నా?" అడిగాడు వెంకటేశ్వర్లు

"ఋతు ఏడీ?"

"ఆయన నాకు అమ్మారు దీన్ని"

"అలాగా సారీ తెలీదు."

మూడో అనుభవంఅరగంట తర్వాతే జరిగింది.

హేవ్ మోర్ ముందు కారాపి లోపలికికెళ్ళి హేవ్ మోర్ స్పెషల్ తిని బయటకివచ్చి కారులో కూర్చున్నాడు.

క్రీ నీడలో తన పక్క సీటులో ఓ అమ్మాయి కూర్చునుందని గ్రహించేలోగా ఆమె తన చేతులని వెంకటేశ్వర్లు మెడచుట్టూవేసి అతని పెదవులని ముద్దు పెట్టుకుంది ఐస్క్రీం కన్నా ఇంకా తియ్యగా.

"ఎవరు మీరు?"

వెంకటేశ్వర్లు కంఠం విని చటుక్కునదూరంగాజరిగింది భయంగా.

"అలాగా నాకు తెలీదు ఆయన తన కారు అమ్మేసినట్లు చెప్పింది కొన్ని క్షణాలు అతను చెప్పింది విని.

"మీరెవరు" అడిగాడు వెంకటేశ్వర్లు ఆ అందమైన అమ్మాయిని చూస్తూ.

"హోమ్ సైన్స్ కాలేజీలో స్టూడెంట్ని"

"ఆయన మీస్నేహితుడా?"

"అవును. ఫ్యాన్ అభిమాన రచయిత ముఖ్యంగా."

వెంకటేశ్వర్లు మర్నాడు ఋతుపవన్ నవల సీరియల్గా ప్రచురించే వారపత్రికకి ఓ ప్రకటనరాసి తీసుకెళ్ళాడు. ఋతుపవన్ కాదు తాను కొనుక్కున్నానని, హైద్రాబాద్లోని అతని అభిమానులు గ్రహించవలసిందని వుంది అందులో.

వెంకటేశ్వర్లు ఇబ్బంది గ్రహించిన ఎడిటర్ ఆ ప్రకటనని వెంటనే వేస్తానని హామీ ఇచ్చాడు.

"ఆహహ" సరిగ్గా ఎనిమిది వారాలతర్వాతే వేయండి అప్పటిదాకా మా ఆవిడ పుట్టింటినించి రాదు "కంగారుగా చెప్పాడు వెంకటేశ్వర్లు.

* *
*